ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 320 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 28 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# ఏపీ సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

**కుమారుడి వివాహ వేడుకకు రావాలని ప్రత్యేక ఆహ్వానం**

**క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక సమావేశం**


**మార్చి 5న హైదరాబాద్‌లో జరగనున్న వివాహ వేడుక**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

ఏపీ సీఎం చంద్రబాబును తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడి వివా హానికి హాజరు కావాలని చంద్రబాబును భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వా నించారు. భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహం మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనుంది. ఈ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల నేతలు కాసేపు ముచ్చటించుకున్నారు. ఈ సమావేశం పూర్తిగా మర్యాదపూర్వకంగానే జరిగిందని, ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టమవుతోంది. తన కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని చంద్రబాబును భట్టి విక్రమార్క కోరారు.



# సత్యమేవ జయతే:



**కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ముందే చెప్పా**

**న్యాయ వ్యవస్థపై నేను పెట్టుకున్న నమ్మకం నిలబడింది**

**ఢిల్లీ మద్యం కేసులో కోర్టు తీర్పుపై కవిత**

**కేసును కొట్టివేసిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఢిల్లీ కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసును రౌజ్ అవెన్యూ కోర్టు కొట్టిపారేసింది. ఆ కేసులో నిందితులుగా ఉన్న 23 మందిపై నమోదు అయిన అభియోగాల నుంచి విముక్తి కల్పించింది. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాతో పాటు కవితను కూడా ఆ కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తున్నట్లు కోర్టు పేర్కొన్నది. కోర్టు తీర్పు నేపథ్యంలో మాజీ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. తన ఎక్స్ అకౌంట్‌లో సత్యమేవ జయతే అని పోస్టు చేశారు. స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ ఈ కేసులో ఆదేశాలు ఇచ్చారు. సీబీఐ దర్యాప్తు చేపట్టిన ఈ కేసును మూసివేయాలని ఆయన ఆదేశించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీలో ఎటువంటి కుట్ర జరగలేదని, నేరపూరిత ఉద్దేశం లేదని కోర్టు చెప్పింది. ఈ కేసులో ఉన్న 23 మంది నిందితులపై సీబీఐ ప్రత్యక్షంగా ఎటువంటి ఆధారాలను చూపించలేకపోయినట్లు కోర్టు పేర్కొన్నది. కేవలం అప్రూవర్ ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా కేసును నమోదు చేసిన సీబీఐ వ్యవహార శైలిని కోర్టు తప్పుపట్టింది. ఒకవేళ ఇలాంటి వ్యవహారాన్ని అనుమతిస్తే, అప్పుడు రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించినట్లు అవుతుందని, నిందితుడికి క్షమాభిక్ష పెట్టి, ఆ నిందిత వ్యక్తిని అప్రూవర్‌గా మార్చి, ఆ వ్యక్తి నుంచి వాంగ్మూలం తీసుకుని దర్యాప్తును కొనసాగించడాన్ని, దాని ఆధారంగా వ్యక్తులను తప్పుపట్టడాన్ని న్యాయమూర్తి ఖండించారు. సీబీఐ అధికారులపై శాఖాపరమైన దర్యాప్తునకు ఆదేశించనున్నట్లు ఢిల్లీ కోర్టు పేర్కొన్నది. 2022, జూలై 20వ తేదీన లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీబీఐ తన కేసును నమోదు చేసింది.

## కేజ్రీవాల్‌కు
# భారీ ఊరట

**ఢిల్లీ మద్యం పాలసీ కేసును కొట్టివేసిన సీబీఐ కోర్టు.. కేజ్రీవాల్ కన్నీటిపర్యంతం**

**కేసు నుంచి కేజ్రీవాల్‌ను డిశ్చార్జ్ చేసిన సీబీఐ కోర్టు**




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

దేశ రాజధానిలో ఆప్ పతనానికి కారణమైన మద్యం విధాన రూపకల్పనలో అవినీతి హై-ప్రొఫైల్ కేసును దిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేజ్రీవాల్‌ను కేసులో ఇరికించారని సీబీఐపై కోర్టు తీవ్రంగా మండిపడింది. ఎక్సైజ్ పాలసీలో ఎలాంటి కుట్ర లేదా నేరపూరిత ఉద్దేశ్యం లేదని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కల్వకుంట్ల కవిత సహా 23 మందికి విముక్తి కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. వారిపై చర్యలు తీసుకోవడానికి తగిన సాక్ష్యాలను సమర్పించడంలో జదీ× విఫలమైందని పేర్కొంది. నిందితులపై ప్రాథమిక కేసులు నమోదు చేయలేదని, సీబీఐ ఛార్జిషీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని న్యాయమూర్తి అన్నారు. ఏ సాక్షి, వాంగ్మూలంతో చార్జ్‌షీట్‌లోని అభియోగాలు సరిపోవడం లేదని పేర్కొన్నారు. దిల్లీ మద్యం విధాన రూపకల్పన కేసులో "సౌత్ గ్రూప్" అనే పదాన్ని ఉపయోగించడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తంచేసింది. అలాంటి వ్యక్తీకరణకు స్పష్టత, సరైన ఆధారాలు లేవని తెలిపింది.

కోర్టు తీర్పు అనంతరం ఆవరణలో మీడియా ముందు మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు కేజ్రీవాల్. "ఆమ్ ఆద్మీ పార్టీకి ..మిగతా 2లో

## సీఎం రేవంత్‌తో
# మాజీ మావోయిస్టు నేతల భేటీ

**సచివాలయంలో సీఎంను కలిసిన ఆరుగురు మాజీ మావో నేతలు**



**సీఎంను కలిసిన వారిలో దేవ్‌జీ, రాజిరెడ్డి, బడే చొక్కారావు తదితరులు**

**పలు అంశాలపై చర్చలు జరిగినట్టు సమాచారం**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

దశాబ్దాల పాటు అడవిని నమ్ముకుని సాయుధ పోరాటం చేసిన మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఇప్పుడు ప్రజాస్వామ్య మార్గంలోకి అడుగుపెడుతున్నారు. కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' చివరి అంకానికి చేరుకోవడంతో, కీలక నేతలు వరుసగా లొంగిపోతున్నారు. ఈ క్రమంలో, హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆరుగురు ..మిగతా 2లో



## తమిళనాడులో ఒకే దశలో
# అసెంబ్లీ ఎన్నికలు!

**ప్రాచీన కాలం నుంచే తమిళనాడులో కుడవోలై విధానం**

**అది ప్రపంచానికి ఆదర్శం- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాష్ట్ర రాజకీయ పార్టీలతో కీలక సమావేశం నిర్వహించారు. చెన్నైలో జరిగిన ఆ సమావేశంలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎన్నికలను ఒకే దశలో నిర్వహించాలని ఎక్కువ పార్టీలు కోరినట్టు అధికారులు తెలిపారు. డబ్బు, బహుమతుల ప్రలోభాలకు కట్టడి విధించాలని కూడా విజ్ఞప్తి చేశారు.

**అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా!**


ఈ సమావేశాన్ని భారత ..మిగతా 2లో

# దశాబ్ద కాలంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

**ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయన్న ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఆవిష్కరణలతో ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆయా పరిశ్రమలకు ఆర్థిక సంస్థలు ఆచరణాత్మక పరిష్కారాలతో అండగా నిలిచి మార్కెట్ నమ్మకాన్ని పెంచాలని సూచించారు. 'వికసిత్ భారత్' కోసం సాంకేతికత, సంస్కరణలు, ఆర్థికం అనే అంశంపై నిర్వహించిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయని మోదీ పేర్కొన్నారు. కాగితంపై ఉన్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో విజయాలుగా సాకారం అవుతాయని వివరించారు. గత ..మిగతా 2లో



# తమిళనాడులో ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు!

**మొదటి పేజీ తరువాయి...**

ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిషనర్లతో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణ, భద్రత, సిబ్బంది శిక్షణ, ఈవీఎంల నిర్వహణ, చట్టవ్యవస్థ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను సమీక్షించారు.

**కఠిన చర్యలు తప్పవు**

రాజకీయ పార్టీలు ఎన్నికల్లో డబ్బు ప్రభావం, ఉచిత పథకాల పంపిణీ వంటి అక్రమాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరాయి. అక్రమాల నివారణకు ఫ్లయింగ్ స్క్వాడ్ల సంఖ్యను పెంచాలని కూడా సూచించాయి. దీనిపై స్పందించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికలు ఎప్పటికీ చట్టబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రలోభాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా!

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజాస్వామ్య సంప్రదాయాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. తమిళనాడుకు



ప్రజాస్వామ్యంలో గొప్ప చరిత్ర ఉందని, ప్రాచీన కాలంలోనే కుడవోలై విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. ఇది ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు. ఇటీవల 72 దేశాల ప్రతినిధులతో అంతర్జాతీయ సమావేశం నిర్వహించి, తమిళనాడులో శతాబ్దాల క్రితమే అమలులో ఉన్న ఎన్నికల విధానం గురించి వివరించామని తెలిపారు. ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

ఓటర్ల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగుతోందని ఆయన తెలిపారు. అర్హులెవరూ తప్పిపోకూడదని, అనర్హులెవరూ జాబితాలో చేరకూడదనే లక్ష్యంతో చర్యలు చేపట్టామని చెప్పారు. తమిళనాడులో అమలు చేస్తున్న విధానం దేశానికి మోడల్‌గా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 75 వేల పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించనున్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలు అందరికీ సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం మరింతగా!

ఎన్నికల పారదర్శకతను పెంచేందుకు కొత్త చర్యలు తీసుకున్నట్టు సీఈసీ వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ఈవీఎంల లెక్కింపుకు ముందే పూర్తి చేయనున్నారు. ప్రతి నియోజకవర్గంలో తప్పనిసరిగా వీవీప్యాట్ స్లిప్‌ల లెక్కింపు జరుగుతుందని స్పష్టం చేశారు. లెక్కింపు అనంతరం అభ్యర్థులు ఫీజు చెల్లించి ఏడు రోజుల లోపు ఈవీఎంలను వీవీప్యాట్‌లతో సరిపోల్చుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. దీనివల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని చెప్పారు.

# సీఎం రేవంత్‌తో మాజీ మావోయిస్టు నేతల భేటీ

**మొదటి పేజీ తరువాయి...**

మాజీ మావోయిస్టు నేతలు ఈరోజు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయిన సీనియర్ నేతలు తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), బడే చొక్కారావు (దామోదర్), నూనె నరసింహారెడ్డి (గంగన్న)లతో పాటు సుజాతక్క, చంద్రన్నలు ముఖ్యమంత్రిని కలిశారు. దశాబ్దాల అజ్ఞాతవాసం తర్వాత ఈ అగ్రనేతలంతా నేరుగా అధికార కేంద్రమైన సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రితో భేటీకి వెళుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు "సీఎంతో ఏం చర్చిస్తారు?" అని ప్రశ్నించగా, అగ్రనేత దేవ్‌జీ స్పందిస్తూ "పొలిటికల్ ఎజెండా" అని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. దీనితో వీరంతా భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. లొంగిపోయిన నేతల పునరావాసం, వారి కుటుంబాల భద్రతపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం వీరు చేపట్టబోయే తదుపరి కార్యాచరణపై సీఎంకు వివరించినట్లు సమాచారం.

# దశాబ్ద కాలంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

**మొదటి పేజీ తరువాయి...**

దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందని ప్రధాని తెలిపారు. 11 ఏళ్ల క్రితం కేవలం రూ. 2 లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు, 2026-27 బడ్జెట్‌లో రూ. 12 లక్షల కోట్లకుపైగా పెరిగాయని వివరించారు. ఈ భారీ కేటాయింపులు ప్రైవేట్ రంగానికి ఒక సంకేతమని పేర్కొన్నారు. మరోవైపు, బడ్జెట్‌లోని విషయాలపై మరింత చర్చ జరిపేకంటే దాని తక్షణ అమలుపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ వాటాదారులను కోరారు.

"బడ్జెట్ గురించి చర్చించడం దీని ఉద్దేశం కాదు. వీలైనంత త్వరగా బడ్జెట్‌ను అమలు చేయడం, అది సులభమైన మార్గంలో చేయడం దీని ఉద్దేశం. వాటాదారులందరూ దీని నుంచి ప్రయోజనం పొందాలి. బడ్జెట్‌ను కేవలం స్వల్పకాలిక వ్యాపార పత్రంగా చూడకూడదు. అది ఒక విధానపరమైన మార్గదర్శి. బడ్జెట్ ప్రభావాన్ని పటిష్టమైన, వాస్తవిక పారామితులపై అంచనా వేయాలి. ఇలాంటి విధానాలు మౌలిక సదుపాయాలను విస్తరించాలి. రుణ లభ్యతను మరింత సరళతరం చేయాలి. సులభతర వాణిజ్యాన్ని పెంచాలి. పాలనలో పారదర్శకత పెరగాలి. ప్రజల జీవనం మరింత సులభతరం కావాలి. బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన నిర్ణయాలు మాత్రమే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. అత్యంత గొప్ప విషయం ఏమిటంటే ఏ బడ్జెట్‌ను కూడా వేరు చేసి చూడడానికి వీల్లేదు. దేశ నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ. ప్రతీ బడ్జెట్ ఒక పెద్ద లక్ష్యాన్ని చేరుకునేందుకు ఒక అడుగు అవుతుంది. మన ముందు ఉన్న ఆ పెద్ద లక్ష్యం ఏమిటంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతావని. ప్రతీ సంస్కరణ, ప్రతీ మార్పు ఈ సుదీర్ఘ ప్రస్థానాన్ని దృష్టిలో పెట్టుకొని మాత్రమే చేయాలి."

- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

అదేవిధంగా, ఆర్థిక రంగం గురించి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్ మార్కెట్లను మెరుగుపరిచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడి చట్రాన్ని మరింత అనుకూలంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

"విదేశీ పెట్టుబడి చట్రాన్ని సులభతరం చేస్తున్నాం. పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చడానికి మేం ప్రయత్నిస్తున్నాం. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్ మార్కెట్లను మరింత చురుగ్గా చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నాం. బాండ్లను కొనుగోలు చేయడం, అమ్మడం వంటి ప్రక్రియను సులభతరం చేస్తున్నాం. దీర్ఘకాలిక వృద్ధికి దోహదపడే బాండ్ మార్కెట్ సంస్కరణలను మనం చూడాలి. స్థిరమైన విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి మనం సరికొత్త సాధనాలను తీసుకురావాలి. ప్రభుత్వం, పరిశ్రమ, ఆర్థిక సంస్థలు, విద్యాసంస్థల మధ్య ఉమ్మడి వెంచర్‌గా స్పష్టమైన సంస్కరణ భాగస్వామ్య చార్టర్‌ను అభివృద్ధి చేయాలి"

-- నరేంద్ర మోదీ, భారత ప్రధాని

అదేవిధంగా పరిశ్రమలు నూతన ఉత్సాహంతో ముందుకు రావాలని ప్రధాని మోదీ కోరారు. 2026-27 బడ్జెట్‌లో ప్రకటించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, విద్యా సంస్థల మధ్య సమన్వయం కోసం 'రిఫార్మ్ పార్టనర్‌షిప్ చార్టర్' రూపొందించాలని ప్రధాని ప్రతిపాదించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ పత్రం కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



సదస్సు కు హాజరైన సతీష్ చంద్రన్ కు స్వాగతం పలుకుతున్న డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్

# మొక్కల ఆరోగ్యంపై సదస్సు

బుద్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) లో స్థిరమైన వ్యవసాయం, మొక్కల ఆరోగ్య నిర్వాహణ అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సు శుక్రవారం కొనసాగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఎన్ఐపీహెచ్ఎం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో వస్తున్న తెగుళ్ల వలన అనేక సమస్యలు ఎదురౌతున్నాయని, వాటి గురించి చర్చించి నివారణ చర్యలు తీసుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. సదస్సులో పెస్టర్మినేటర్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ సతీష్ చంద్రన్, మాట్లాడుతు, పంట కోత తర్వాత నష్టాలను తగ్గించడానికి ఆధునిక సురక్షిత నిల్వ పద్ధతులు, కార్యచరణ సవాళ్లు, సేవా అంచనాలు, నియంత్రణ అవసరాలపై దృష్టి సారిం చాలన్నారు. కార్యక్రమంలో కాశ్మీర్ లోని షాలిమార్ లో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ నజీర్ అహ్మద్ గనై, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ శరత్ బాబు, ధనుక అగ్రిటెక్ లిమిటెడ్ కు చెందిన డాక్టర్ కె రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో 100 రోజుల సమగ్ర ఆరోగ్య సేవలు: డాక్టర్ లలితాదేవి

బుద్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)



రంగారెడ్డి జిల్లాలో ప్రజలకు మరింత సమగ్ర, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు వంద రోజుల ఆరోగ్య కార్యక్రమాన్ని మూడు దశలలో అమలు చేయనున్నట్లు జిల్లా వైద, ఆరోగ్యశాఖ అధికారిణీ డాక్టర్ లలితాదేవి తెలిపారు. మొదటి దశ మార్చి 4 ను ంచి మార్చి 31వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు నిర్ణయించిన తేదీలలో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహిం చడానికి సన్నాహక సమావేశంలో జిల్లా డిప్యూటీ జిల్లా వైద్యాధికారుల, ప్రొగ్రామ్ అధికారులతో కలసి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు శుక్రవారం జూమ్ మీటింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. మొదటి దశ లో మాతృ, మహిళ ఆరోగ్యం, శిశు ఆరోగ్యంలో బాగంగా అనీమియ, స్కానింగ్, చికిత్స ఐఎఫ్ఎ మాత్రల పంపిణీ, హై రిస్క్ గర్భిణీల గుర్తింపు, పర్యవేక్షణ, ప్రసవానంతరం 14 రోజుల లోపు గృహ సం దర్శనాలు, మెన్సెస్ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు, స్థాన, గర్భాశయముఖ క్యాన్సర్, స్క్రీనింగ్ కార్యక్రమంలో నిపుణులైన గైనకాలజిస్ట్ లచే పరీక్షించి గుర్తించిన వారికి చికిత్స అందజేయడం జరుగుతుం దన్నారు. అదే విదంగా పూర్తి టీకాల కార్యక్రమం బలోపేతం, జీరో డోస్ పిల్లల గుర్తింపు, ట్రాకింగ్, విటమిన్-ఏ పంపిణీ, చిన్న పిల్లల డాక్టర్లచే గుర్తించి చికిత్స అందజేయడం జరుగుతుందన్నారు. అదే విదంగా పూర్తి టీకాల కార్యక్రమం బలోపేతం, జీరో డోస్ పిల్లల గుర్తింపు, ట్రాకింగ్, విటమిన్-ఏ పంపిణీ, చిన్న పిల్లల డాక్టర్లచే గుర్తించి చికిత్స అందజేయడం జరుగుతుందన్నారు. యువత కోసం అనీమియ నివారణ చర్యలు, పరీక్షల ఒత్తిడి నివారణ చర్యలు, పరీక్షల ఒత్తిడి నివారణ కౌన్సిలింగ్, మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక జెర్యాట్రిక్ క్యాం పులు నిర్వహించి రక్తపోటు, మధుమేహం, ఇతర దీర్ఘ కాలిక వ్యాధుల స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి రిఫరల్ సేవలను అందించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అంగన్వాడీలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి ఈ కార్యక్రమాన్ని పకడ్బందిగా అమలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామ, పట్టణ, బస్తీ స్థాయిలలో విస్తృత స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్బీఎస్ కె వైద్యుల ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలలలో కంటి పరీక్షలు, రక్తహీనత పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ గీత, డాక్టర్ రాధిక, డాక్టర్ పాపారావు, డాక్టర్ లక్ష్మీప్రసన్న, ప్రోగామ్ అధికారులు డాక్టర్ షీబా హయత్, డెమో శ్రీనివాసులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఫ్లై ఓవర్ పనులు ప్రారభం

## పనులు పరిశీలించిన సిపి సజ్జనార్

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)

బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లో పార్క్ హయత్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనులని మేఘా నిర్మాణ సంస్థ ప్రారంభించింది. వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైన ప్రాంతాన్ని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. సీపీ సజ్జనార్‌తో పాటు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ దేవిస్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమైన సందర్భంగా శుక్రవారం నుంచి పలుమార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. ఇందులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఫ్లై ఓవర్ ఏడు అండర్ పాసుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ రోజు పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఇవాళ నుంచి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే వాహనదారులకు పలు సూచనలు చేశామని అన్నారు. రెండు సంవత్సరాల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేశామని తెలిపారు. నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పాన్ చేశామని చెప్పుకొచ్చారు. ఫ్లై ఓవర్ నిర్మాణ సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణ పనులు దశల వారీగా జరుగుతాయని వెల్లడించారు. రాత్రి వేళ ఎక్కువగా పనులు చేయాలని నిర్మాణ సంస్థలను కోరామని అన్నారు. బేస్‌మెంట్ పూర్తి అయితే తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు సవరించే అవకాశం ఉంటుందని తెలిపారు. 7 అండర్ పాసులు, 7ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వస్తే ఆయా రోడ్లు సిగ్నల్ ఫ్రీగా మారుతాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.



బీఆర్ పార్కు చుట్టూ 7 ఫ్లై ఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైందని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ దేవిస్ తెలిపారు. ఈ సందర్భంగా జోయల్ దేవిస్ మాట్లాడుతూ నిర్మాణ పనులను దృష్టిలో ఉంచుకొని వాహనదారులకు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశామని అన్నారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే వాహనాలు శ్రీనగర్ కాలనీ, ఇంద్రానగర్ బస్తీ మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెళ్లాలని జోయల్ దేవిస్ సూచించారు. మాసబ్ ట్యాంక్ నుంచి కేబీఆర్ పార్కు మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెళ్లే వాహనాలు రోడ్ నెంబర్- 45 మీదుగా వెళ్లాలని అన్నారు. రెండున్నర నెలలపాటు బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లో పిల్లర్స్ పనులు కొనసాగుతాయిని వివరించారు. రెండున్నర నెలలపాటు కొంత ట్రాఫిక్ సమస్య ఉంటుందని.. పరిస్థితులను బట్టి ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. పీక్ అవర్స్‌లో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తెలిపారు. నిర్మాణ పనులు ప్రారంభమైనందున వాహనదారులు పోలీసులకు సహకరించాలని జోయల్ దేవిస్ కోరారు.

# వరంగల్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)

వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో జాప్యంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజారోగ్యంపై ఎందుకంత నిర్లక్ష్య ధోరణి అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. 2021 జూన్ 21వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. 24 అంతస్తులతో రెండు వేలకు పైగా పడకల సామర్థ్యంతో పలు జిల్లాల ప్రజలకు సేవలు అందించేలా ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూపకల్పన చేశామని తెలిపారు. రెండేళ్లలో 75 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. 2023 వరకు కూడా ఈ ప్రాజెక్టు వేగంగా సాగిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులు నెమ్మదించాయని చెప్పారు. కావాలనే ఈ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు.

# మైలార్దేవుపల్లిలో ఘనంగా నిషాన్ యాత్ర

బుద్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)

మైలార్దేవుపల్లి, కాటేదాన్ ప్రాంతాలలో శుక్రవారం సాయ త్రం శ్రీ శ్యామ్ మిత్ర మండల్ ఆధ్వర్యంలో నిషాన్ యాత్ర ఘనంగా జరిగింది. కాటేదాన్ నుంచి శివరాం పల్లి రాందేవ్ బాబా మందిరం వరకు ఈ యాత్ర కొనసాగింది. యాత్రలో బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రావుల బాస్కర్, అడికె జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలందరికి మేలు జరుగాలని భగవంతున్ని ప్రార్థించామని తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోద పాండు యాదవ్, దత్తు, నర్సిరెడ్డి, మదుసూదన్ రెడ్డి, రామారావు, రమేశ్ రెడ్డి, కిరణ్, శ్యామ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




నిషాన్ యాత్రలో పాల్గొన్న బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డి


### మార్చి 1వ తేదీన యువ నాయకుడు

# పట్లోళ్ల కార్తిక్ రెడ్డి జన్మదిన వేడుకలు

### ఏర్పాటు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


యువ కిషోరం పట్లోళ్ల కార్తీక్ రెడ్డి


బీఆర్ఎస్ నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి


తల్లి సబితా ఇంద్రారెడ్డి తో కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా అంటే హోం శాఖ మాజీ మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి ( ఇంద్రన్న), మాజీమంత్రి, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి పేర్లు గుర్తుకొస్తాయి. వారి పెద్ద కుమారుడు బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ , యువకిశోరం పట్లోళ్ల కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలను మార్చి 1వ తేదీన ఘనంగా నిర్వహించడానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, కాటేదాన్, మైలార్ దేవుపల్లి, హైదర్ గూడ డివిజన్ లలో కార్తీక్ రెడ్డి జన్మదినం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

**పిలిస్తే పలికే కుటుంబం :**


నాడు ఇంద్రన్న ను మొదలుకొని... నేడు సబితమ్మ... వారి తనయుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి లు పిలిస్తే పలికే ఆత్మీయులుగా రంగారెడ్డి జిల్లా ప్రజలకు సుపరిచితులు. ప్రజలకు పార్టీలకతీతంగా ఏ కష్టం వచ్చినా మేమున్నామని


ఎన్నికల ప్రచారం లో కార్తీక్ రెడ్డి

ముందుండి ఆదుకునే కుటుంబం పట్లోళ్ల కుటుంబం. ప్రజలే మా బలం అనే నినాదంతో గడచిన ఐదు దశాబ్దాలుగా పట్లోళ్ల కుటుంబం రాజేంద్రనగర్ నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ , నేటి తెలంగాణ రాష్ట్రాలకు, ప్రజలకు సేవలు అందిస్తూ వస్తోంది. నిస్వార్థమైన ప్రజాసేవ ఈ కుటుంబానికి అంకితం. అందుకే సబితమ్మ వారసునిగా రాజకీయాల్లోకి వచ్చిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డికి ప్రజలు నీరాజనం పడుతున్నారు.

**రాబోయే కాలంలో కాబోయే ఎమ్మెల్యే కార్తీక్ రెడ్డి :**

రాబోయే రోజుల్లో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగిస్తారాని ప్రజలు విశ్వసిస్తున్నారు. వారి కుటుంబం ద్వారానే రంగారెడ్డి జిల్లా అభివృద్ధి చెందిందని, వారు ఏ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఆ ప్రాంతం అభివృద్ధిలో దూసుకుపోతుందని ప్రజలు విశ్వసిస్తారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు అన్ని వర్గాల మేలు కోసం ఆలోచించే కుటుంబం పట్లోళ్ల కార్తీక్ రెడ్డి కుటుంబమని గుర్తు చేసుకుంటూ, ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు.


ఇంద్రన్న వారసుడు


చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు డాక్టర్ ఎం వి సౌందర్య రాజన్ పార్థీవ దేహానికి నమస్కరిస్తున్న మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

## సౌందర్య రాజన్ గొప్ప ఆధ్యాత్మిక గురువు


**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం) :**

చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ ఎం.వి. సౌందర్య రాజన్ పరమపదించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆయన గొప్ప ఆధ్యాత్మిక గురువు అని కొనియాడారు. గురువు గా ఆయన అనేక మందిని ఉన్నత పౌరులు గా తీర్చిదిద్దారాన్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయం దినదిన అభివృద్ధి చెందడం వెనుక ఆయన కృషి ఎంతగానో ఉందన్నారు. ప్రజలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడానికి ఆయన చేసిన కృషి అమోఘం అన్నారు. సౌందర్య రాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తు ఆయన కుమారుడు సీఎస్ రంగరాజన్ , ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు .

## బస్తీ మధ్యలో షెడ్డు నిర్మాణం చేయకుండ చూడాలి

**బుద్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం):**

రాజేంద్రనగర్ సర్కిల్ గగన్ పహాడ్ దళిత బస్తీలో నివాసాల మధ్య షెడ్డు వేయడానికి పనులు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని స్థానిక భరత్ యూత్ క్లబ్ సభ్యులు కోరుతున్నారు. నివాసాలకు దగ్గర లో ఉన్న చాలా వరకు పరిశ్రమలను ఇక్కడి నుంచి తొలగించడానికి ఎంతో కష్టపడ్డామని గుర్తు చేస్తున్నారు. తిరిగి నివాసాలకు అనుకుని షెడ్డు వేస్తున్నారని, అందులో పరిశ్రమ ను పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగచేస్తారని, రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు షెడ్డు వేయకుండ అడ్డుకోవాలన్నారు. షెడ్డు నిర్మాణం చేసి గోదాము గా ఏర్పాటు చేసుకుని భారీ వాహనాలను తీసుకువచ్చి బస్తీ ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా చేస్తారన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.


బస్తీ మధ్యలో వేస్తున్న షెడ్డు

## గ్రేటర్ కమిషనర్‌ను కలసిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు

**బుద్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన మంద మకరందు శుక్రవారం గ్రేటర్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ను జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రేటర్ కమిషనర్ కు పుష్పగుచ్చం అందజేశారు. రాజేంద్రనగర్ జోన్ అభివృద్ధికి చురుకుగా పనిచేయాలని ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కు గ్రేటర్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ సూచించినట్లు తెలిసింది. పారిశుధ్య నిర్వాహణ లో పకడ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారని సమచారం.


గ్రేటర్ కమీషనర్‌ను కలసిన మంద మకరందు


వేముల రుద్రాంష్ జన్మదిన వేడుకలలో పాల్గొన్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

## ఘనంగా వేముల రుద్రాంష్ జన్మదిన వేడుకలు

### పాల్గొన్న కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్‌లు


రుద్రాంష్ ను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్

**బుద్వేల్, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**

తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్, రాజేంద్రనగర్ వాస్తవ్యులు వేముల రామకృష్ణ పరమేశ్వరీ ల కుమారుడు వేముల రుద్రాంష్ మొదటి జన్మదిన వేడుకలు గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం సామ భూపాల్ రెడ్డి గార్డెన్స్ లో ఘనంగా జరిగాయి. జన్మదిన వేడుకలలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు విద్యార్థి సంఘం నేతలు పాల్గొన్నారు. వేముల రుద్రాంష్ ను ఆశీర్వదించారు.

## జూబ్లీహిల్‌లోని రేవంత్ రెడ్డి ఇంటిని కూల్చి వెయ్యి అడుగుల గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

### తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ

**బుద్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం) :**



మూసీ సుందరీకరణ పేరుతో మదు పార్క్ రిడ్జి అపార్ట్మెంట్ లోని 420 ఫ్లాట్లను కూల్చాలనుకుంటున్న ప్రభుత్వం జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిని కూల్చి ఆ స్థలంలో వెయ్యి అడుగుల గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ ఓ ప్రకటన లో డిమాండ్ చేశారు. విగ్రహాలు ఏర్పాటు చేసే బదులు విద్యార్థులకు సంక్షేమ హాస్టల్స్, కళాశాలలు నిర్మించాలన్నారు. సంక్షేమ హస్టల్లకు అద్దెలు చెల్లించకపోవడంతో పరీక్షల సమయంలో భవనాలు ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి చేస్తున్నారని గుర్తు చేశారు. మధ్య తరగతి ప్రజలు ఎన్నో సంవత్సరాలు కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి లోన్లు తీసుకుని కొనుగోలు చేసిన ఇండ్లను కూల్చి గాంధీ విగ్రహం పెడతాము అంటే ఎలా అని ప్రశ్నించారు. సుందరీకరణ పేరుతో మధ్య తరగతి ప్రజల ఇండ్లను కూల్చడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. బడా వ్యాపార వేత్తలు నిర్మిస్తున్న అక్రమ నిర్వాణాల గురించి ప్రభుత్వానికి పట్టదా అని అన్నారు. మధ్య తరగతి ప్రజల ఇళ్లను లాక్కొని బడా వ్యాపారవేత్తలకు ఆ స్థలాలను కట్టబెట్టాలనే కుట్ర జరుగుతుందన్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని గుర్తు చేశారు. మదు పార్క్ రిడ్డి లాంటి ఆ పార్ట్మెంట్ ల జోలికి వెళ్లకుండ ఎవరికి ఇబ్బంది కలుగని అభివృద్ధి, సుందరీకరణ చేపట్టాలని వేముల రామక్రిష్ణ సూచించారు.


హరిచరణ్ గౌడ్ ను కలిసి పరమార్శిస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## హరిచరణ్ గౌడ్‌ను పరమార్శించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

కాలు గాయంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న గౌడ సంఘం రాష్ట్ర కోశాధికారి పి. హరిచరణ్ గౌడ్ ను శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ బుద్వేల్ లోని ఆయన నివాసంలో కలసి పరమార్శించారు. గౌడ సంఘం కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే హరిచరణ్ గౌడ్ కాలు కు గాయం కావడం బాధాకరమన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. హరిచరణ్ గౌడ్ ను కలసిన వారిలో గౌడ సంఘం నాయకులు పి.నందం గౌడ్, బద్దం దాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రగడంపల్లి శ్రావణ్ తదితరులున్నారు.

# పరిసరాల పరిశుభ్రత చాలా అవసరం

### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు



బండ్ల గూడ జాగీరు లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ గురించి తెలుసుకుంటున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు..



బండ్ల గూడ సన్ సిటీ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెత్తను అధికారులకు చూపుతున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు



పీరంచెరువు వద్ద....


**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమని, ఆ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించకూడదని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు సూచించారు. జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించాక మొదటిసారిగా ఆయన బండ్లగూడ , పీరం చెరువు ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటించారు. రోడ్ల పక్కన చెత్త ఉండకుండా చూడాలన్నారు. మార్కెట్ ప్రాంతాలలో ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువులు, పార్కుల వద్ద కూడా చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యంగా ఉండకూడదు అని సూచించారు. తాను ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తూనే ఉంటానని, అధికారులు, సిబ్బంది అలెర్ట్ గా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు


# పట్టణాభివృద్ధికి పార్టీలకు అతీతంగా ముందుంటా



మున్సిపాలిటీ నూతన పాలకవర్గం



మాట్లాడుతున్న చైర్ పర్సన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

### పట్టణ అభివృద్ధి నా మొదటి లక్ష్యం

### మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్

### మన వార్డు మన మున్సిపాలిటీ మార్చి 3 నుండి ప్రోగ్రాం ప్రారంభం

### కౌన్సిల్‌కు హాజరుకాని 27 వ వార్డు కౌన్సిలర్ చెంచారాపు కర్ణాకర్ రెడ్డి

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం):**

జనగామ పట్టణాభివృద్ధికి పార్టీలకు అతీతంగా తోడ్పాటు అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ మున్సిపల్ లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు, చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. జనగామ మున్సిపాలిటీ రాష్ట్రంలో పురాతనమైన మున్సిపాలిటీ పట్టణ అభివృద్ధిలో జరగవలసిన అభివృద్ధి జరగలేదని అన్నారు. ఈ నూతన కౌన్సిల్ పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా అభివృద్ధిలో తోడ్పాటు అందించాలని అందుకోసం అత్యధిక నిధులు తీసుకువచ్చేందుకు అవసరమైతే ప్రభుత్వం మంత్రులతో మాట్లాడి పట్టణ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు.

కౌన్సిల్లో కౌన్సిలర్లు ప్రతి వార్డు అభివృద్ధి కోసం తోడ్పాటు ఇస్తామని తెలిపారు. ఈ తొలి సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జనగామ పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ జనగామ ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ సహకారం కేంద్ర నిధులతో అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఈ చైర్మన్ పదవి అనేది బాధ్యతగా ప్రజలు ఇచ్చిన వరంగా ప్రజలకు సేవ చేయడమే నా ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. పార్టీలకతీతంగా ప్రతి కౌన్సిలర్ జనగామ పట్టణ అభివృద్ధికి తారతమ్య భేదాలు లేకుండా పట్టణ అభివృద్ధికి పాటుపడేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పర్వతాలు. కౌన్సిలర్ లు

1 వ వార్డు సజ్జ దుర్గాప్రసాద్,
2 వ వార్డు రామగాళ్ల విజయ్ కుమార్ విజయ్,
3 వ వార్డు బూడిద జ్యోతి,
4 వ వార్డు మంత్రి సుమలత,
5 వ వార్డు మిద్దెపాక భాస్కర్,
6 వ వార్డు బుక్క భరద్వాజ్,
7 వ వార్డు సాజిద్ కమర్
8 వ వార్డు సందుపట్ల మంజుల,
9 వ వార్డు గుడిగంటి వెన్నెల,
10 వ వార్డు నీరటి రజిని,
11వ వార్డు ఎనగందుల అనూష,
12వ వార్డు వంగ ఉమా,
13 వ వార్డు పానుగంటి సువార్త,
15 వ వార్డు మారబోయిన పాండు,
16 వార్డు కడమంచి సుశీల రమేష్,
18 వ వార్డు గోపగాని సుగుణాకర్,
19 వ వార్డు దోర్నాల అనిత,
20 వ వార్డు దామెర రామ,
21 వ వార్డు మామిడాల రజిత,
24 వ వార్డు గంగరబోయిన అనిత,
25 వ వార్డు పాముకుంట్ల ప్రసాద్,
26 వ వార్డు చేవెళ్లి మధు,
28 వ వార్డు మహమ్మద్ కమర్,
30 వ వార్డు నరసింహారెడ్డి లోకమంతా రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రొబిషన్, ఎక్సైజ్ అధికారిణి అనిత

## కల్లు గీత కార్మికులకు క్కాటమయ్య రక్ష కిట్ల పంపిణి

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం):**

జిల్లా కేంద్రంలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భువనగిరి ఎంపీ మాట్లాడుతూ.. శిక్షణ పొందిన ప్రతి గీత కార్మికుడు విధిగా రక్షణ కిట్లను ఉపయోగించాలన్నారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికులందరూ ఈ రక్షణ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. (419) మంది కల్లు గీత కార్మికులకు తగు సూచనలు చేస్తూ గీత కార్మికులకు వారు కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, డీపీఈఓ అనిత, ఏబీసీడీఓ రవీందర్, కెజికెఎస్ ప్రధాన కార్యదర్శి వెంకట మల్లయ్య, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, వెనుకబడిన తరగతుల శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఢిల్లీలో ఆల్ ఇండియా ఎన్ఎస్‌యుఐ నూతన నాయకత్వాన్ని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ ప్రతినిధులు

### తెలంగాణ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

దేశ రాజధాని ఢిల్లీలోని ఎంపీ క్వార్టర్స్‌లో ఆల్ ఇండియా నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నూతనంగా నియమితులైన నాయకుడు వినోద్ శంకర్ జీని తెలంగాణ రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్, జాతీయ సమన్వయకర్త మన్నె జీవన్, రాష్ట్ర నాయకులు కుందన్ యాదవ్, వెంకటేష్, సాయికిరణ్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు. నాయకత్వ బాధ్యతలు స్వీకరించిన వినోద్ జాఖర్ జీకి వారు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. నూతన నాయకత్వంలో ఎన్ ఎస్ యు ఐ జాతీయ స్థాయిలో విద్యార్థుల సమస్యలను మరింత బలంగా, స్పష్టంగా, పోరాట పటిమతో ప్రస్తావిస్తుందని తెలంగాణ ప్రతినిధులు విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కులు, సమాన అవకాశాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణలో వినోద్ జాఖర్ జీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలకు కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో సమన్వయం మరింత బలపడే దిశగా ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.



## భూ వివాదంలో గాయపడిన మహిళా కుమ్మరి రాణి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**



పరామర్శిస్తున్న ఐద్వా బృందం-ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ నర్మద

జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో భూవివాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కుమ్మరి రాణిని శుక్రవారం ఐద్వా బృందం వెళ్లి పరామర్శించడం జరిగింది . ఈ సందర్భంగా ఐద్వ జిల్లా కార్యదర్శి ఏ నర్మదా మాట్లాడుతూ... గత కొంతకాలంగా కుమ్మరి రాణి కి రావలసినటువంటి వారసత్వపు భూమి ఐదు ఎకరాలు తన కొన్న పట్టా భూమి 1:36 గుంటలు ఆ భూమి కూడా మరిది అయినటువంటి మల్లేష్ భూమి కబ్జా చేశాడు. తన భూమి కోసం ఊర్లో ఉన్నటువంటి పెద్ద మనుషుల దగ్గరికి అధికారుల దగ్గరికి వెళ్లడం జరిగింది అయినా కూడా ఈ సమస్య పరిష్కారం కాలేదు. బుధవారం రోజు తన కూతురు మంజులతో కలిసి పొలం చూడడానికి వెళ్లారు ఆ సందర్భంగా మరిది మల్లేష్ తో పాటు వారి కుటుంబ సభ్యులు మల్లేష్ ని రెచ్చగొట్టి రాణి పైకి ఉసిగొలిపారు మల్లేష్ కుటుంబ సభ్యులు చంపెయ్ అని మాట్లాడటం వల్ల మల్లేష్ రెచ్చిపోయి మారు నా యుధాలతో రానిపై దాడి చేయడం జరిగింది. ఈ అంశంపై ఈరోజు ఐద్వా బృందం జిల్లా ఎస్పీ గారిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎస్పీ గారు కూడా సానుకూలంగా స్పందిస్తూ ఇలాంటి హింసకు పాల్పడుతున్న అటువంటి వ్యక్తులపైన కఠినంగా చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది. కలవడం జరిగింది. ఐద్వా నాయకులు అములు, జయమ్మ, లక్ష్మి, మంజుల , సి పి ఎం జిల్లా కమిటీ సభ్యులు వి వి నరసింహ , రాముడు తదితరులు పాల్గొన్నారు.




దేవస్థాన నూతన కమిటీ సభ్యులు

## శ్రీ వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం):**

జిల్లా లోని దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామ పరిధిలో ఉన్న శ్రీ వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన కమిటీ ని గ్రామపంచాయతీ సర్పంచ్ భాషిపాక రాములు, పాలకవర్గం ఆధ్వర్యం లో ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ చైర్మన్ గా చెన్నూరి నర్సింగరావు, వైస్ చైర్మన్ గా పాముకుట్ల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా సుడిగాల మల్లేష్, కోశాధికారిగా దరగాని కృష్ణ ఎన్నుకున్నారు.

**కమిటీ సభ్యులుగా :**

పంతం సోమన్న, పెద్ది సందీప్, నక్క భాస్కర్, సుడిగాల నరేష్, కాశబోయిన యాకన్న, కాశబోయిన మల్లేష్, భాష పాక ఉప్పలయ్య, ఒంగూరి వెంకన్న, పడమటింటి కుమార్, భాషపాక అశోక్, భాషపాక అభిషేక్, పడకంటి శ్రీకాంత్, పడకంటి నరసింహాచారి, రేషపల్లి శ్రీమాన్, జంపాల నవీన్, ఫైండ్ల సుధాకర్, ఫైండ్ల అంజయ్య, దొంటిక మహేష్, ఎలకపెల్లి బాలయ్య, తోట రవి, ఎడ్ల సోమ నరసయ్య, కాడబోయిన వినోద్ కుమార్, రేషపల్లి వంశీ, జిట్టే సంపత్, నల్ల రమేష్, నల్ల ఉపేందర్, గుమ్మడవెల్లి శ్రీనివాస్, అజ్మీర విజయ్, జాటోత్ వీరన్న, మూడ రవి, బానోత్ నవీన్, గిట్ల ఉమేష్, ఉత్తెపు రవి, బిట్ల ఉమేష్ తదితరులను ఎన్నుకున్నారు.



ఆటో డ్రైవర్ కు కంటి అద్దాలను పంపిణి చేస్తున్న DCP

## జనగామ పోలీస్ ఆధ్వర్యంలో సన్ రైస్ హాస్పిటల్‌లో కంటి పరీక్షల శిబిరం

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం):**

డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ (డీజీ)ఆదేశాల మేరకు వరంగల్ సీపీ ఉత్తర్వులతో, వరంగల్ వెస్ట్ జోన్ జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో జనగామ పట్టణంలోని సన్ రైస్ హాస్పిటల్ లో కంటి పరీక్షల శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ భరత్, ఎస్ఐ రతీష్, ఎస్ఐ చెన్నకేశవులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లను లక్ష్యంగా తీసుకుని కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. రాత్రి డ్రైవింగ్, దుమ్ము, కాలుష్యం వంటి కారణాల వల్ల కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వారికి తెలియజేశారు. శిబిరంలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, చూపు సమస్యలు ఉన్న డ్రైవర్లను గుర్తించి వారికి అవసరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. చూపు లోపం ఉన్న వారికి తక్షణమే కళ్లద్దాలు కూడా అందచేశారు. ఈ కార్యక్రమం పట్ల ఆటో డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేసి, పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.. ప్రజల ఆరోగ్యం, రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్థామన్నారు.

# పిల్లలు ప్రతినిత్యం సైన్సును నేర్చుకోవడమే కాకుండా నిత్యజీవితంలో ఆచరించాలి







రోబో ను ప్రదర్శన చేస్తున్న 3వ తరగతి విద్యార్థులు

### విద్యార్థులు సెల్ ఫోన్ వాడకంపై దృష్టి పెట్టకుండా పుస్తకాల మీద శ్రద్ధ వహించాలి

### డిసిపి రాజా మహేంద్ర నాయక్

### ఏకశిలా పబ్లిక్ స్కూల్లో ఘనంగా రోబో జనసిస్ - 2026

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం):**

జిల్లా కేంద్రం లోని ఏకశిలా పబ్లిక్ స్కూల్ లో శుక్రవారం రోబో జనసిస్ - 2026 ఎక్సుహిభిషన్ కార్యక్రమం చాలా అద్భుతంగా జరిగింది. ఈ రోబోటిక్ ఎక్సుహిభిషన్ లో వరంగల్ వెస్ట్ జోన్ జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలు ప్రతినిత్యం సైన్సును నేర్చుకోవడమే కాకుండా నిత్యజీవితంలో ఆచరించాలని తాము చదువుకున్న పాఠశాలకు ముఖ్య అతిథిగా వచ్చేంత గొప్ప వాళ్ళుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సెల్ ఫోన్ వాడకంపై దృష్టి పెట్టకుండా పుస్తకాల మీద శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లిదండ్రులకు డ్రైవింగ్, డ్రగ్స్ , సైబర్ నేరాల విషయంలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ లవ కుమార్ రెడ్డి, ప్రముఖ పాత్రికేయులు కన్న పరశురాములు, ట్రస్మా అధ్యక్షులు వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, రోబో జనసిస్ కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అర్థబోట్స్ టెక్నాలజీ హైదరాబాద్ వారి చేత తయారుచేసిన 40 రోబోట్స్ ని ప్రదర్శించారు.. ఇందులో హుమానయిడ్ రోబో , లైన్ ఫాలోయర్స్ రోబో , అనిమట్రానిక్ అయిస్ రోబో , ఫైర్ ఫైటింగ్ రోబో , 3డి ప్రింటర్ , మర్స్ రోవర్ రోబో లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అర్థబోట్స్ వ్యవస్థాపకులు రాజేష్ , శ్రీ హర్షలు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పిల్లలను పర్యవేక్షించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఉపేందర్ రెడ్డి , డైరెక్టర్ ఇందిర పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో శ్రమించిన సైన్స్ ఉపాధ్యాయులను, వారికి సహకరించిన ఇతర ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పిల్లలు ప్రదర్శించిన వివిధ నమూనాలను తిలకించి తల్లిదండ్రులు ముగ్ధులయ్యారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.

# వానరాలతో హడల్!




### గద్వాల పట్టణ వాసులను బెంబేలెత్తిస్తున్న కోతులు
### పట్టణంలో గుంపులుగా సంచారం
### పట్టించుకోని అధికారులు.. నానాటికీ పెరిగిపోతున్న సంతతి

**గద్వాల, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**

గద్వాల మునిసిపాలిటీలో కోతుల బెడద నానాటికీ అధికం అవుతున్నది. గత కొంతకాలంగా కంటిమీద కునుకులేకుండా చేస్తున్న వానర దండుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి వచ్చినప్పటికీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. నిరంతరం తమను ఇబ్బంది పెడుతున్న కోతులను పట్టుకొని, అటవీ ప్రాంతంలో వదిలేయడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మునిసిపాలిటీలో సుమారు రెండు సంవత్సరాల నుంచి కోతుల సంతతి అధికంగా వుంది. పట్టణంలో భీంనగర్, అశోక్ నగర్, రాతిబురుజు, తదితర ప్రాంతాల్లో కోతుల సంచారం అధికంగా వుంది. పలు వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇళ్ల ఆవరణల్లోకి, మేడలపైకి యథేచ్ఛగా చొరబడుతున్నాయి. ఆహార పదార్థాలను తిన్నంత మేర తినేసి, మిగిలిన వాటిని పాడు చేస్తున్నాయి. తరుముదామంటే.. మీదకు వచ్చి కరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వీటి ఆగడాలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. భీంనగర్ లో స్కూల్ పిల్లలు స్కూల్ కు వెళ్లాలంటే భయపడుతున్నారు. కోతులకు భయపడి చిన్నారులు, మహిళలు రహదారులపై రాకపోకలు సాగించాలంటే హడలిపోతున్నారు. కోతుల దాడిలో ప్రాణాలు పోతే తప్ప.. అధికారులు పట్టించుకోరా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు, అటవీశాఖ అధికారులు కోతులను పట్టుకుని అడవులకు తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**స్కూల్ కు వెళ్లాలంటే భయమేస్తుంది: వైష్ణవ్ రెడ్డి**

పట్టణంలోని భీంనగర్ లో ప్రవంతి హాస్పిటల్ లేన్ లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులు మూకుమ్మడి వచ్చి ఇండ్లలో ఉన్న సామాన్లు పట్టుకుపోతున్నాయి అడ్డుకుంటే.. మీదకు వచ్చి కరిచేలా ప్రవర్తిస్తున్నాయి. ఈ రూట్ లో స్కూల్ వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి, కోతులను పట్టించి అడవుల్లో విడిచిపెడితే బాగుంటుంది.



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న శేర్లింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ వాంబే కాలనీ లోని బ్లాక్ అశీ.15 వాసులు ఇబ్రహీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇఫ్తార్ విందు కార్యక్రమానికి శేరిలింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



మేయర్ గుమాల మమత శ్రీనివాస్ ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి




మేయర్ పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న గుమాల మమత శ్రీనివాస్ , చిత్రంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

### ప్రజావిశ్వాసానికి తగిన విధంగా పారదర్శకంగా, అభివృద్ధి దిశగా,
# ప్రజాసేవలో నిబద్ధతతో పని చేయాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి
### ఘనంగా మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ మేయర్ ,డిప్యూటీ మేయర్, కార్పోరేటర్ల పదవీ ప్రమాణ స్వీకారం

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్ల పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతనంగా పదవీబాధ్యతలు స్వీకరించిన మేయర్ గుమాల మమత శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి కార్పోరేటర్లను ఘనంగా సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా పారదర్శకంగా, అభివృద్ధి దిశగా, ప్రజాసేవలో నిబద్ధతతో పని చేయాలని సూచించారు. మహబూబ్ నగర్ నగర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్ పి వెంకటేష్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మత్ అలి, ఐఎన్టీయుసి రాములు యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కార్పోరేటర్లు , ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



### ప్రగతి ధర్మారంలో ఘనంగా
## పెంటపర్తి లక్ష్మి నరసింహారెడ్డి పదవి విరమణ వేడుక
### హాజరై శుభాకాంక్షలు తెలిపిన జనంపల్లి పురేందర్ రెడ్డి

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

ప్రగతి ధర్మారం గ్రామంలో పెంటపర్తి లక్ష్మి నరసింహారెడ్డి పదవి విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు భారీ సంఖ్యలో హాజరై ఆయనకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్మి నరసింహారెడ్డి 34 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా సేవలందించి వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన మహనీయుడని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన వ్యక్తిగా ఆయన పేరు ప్రతిష్ఠలు సంపాదించారని తెలిపారు. పిల్లలతో ఆటపాటల మధ్య విద్యాబోధనను ఆనందదాయకంగా మార్చి, సహచర సిబ్బందితో కలిసిమెలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన చేసిన సేవలు అమూల్యమైనవని, అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడంలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి నరసింహారెడ్డి దంపతులను శాలువాతో సన్మానించి స్మృతిచిహ్నాలు అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. లక్ష్మి నరసింహారెడ్డి దంపతులు నిండా నూరేళ్లు అష్టైశ్వర్యాలతో, ఆరోగ్యసంతోషాలతో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని జనంపల్లి పురేందర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వజ్ర శేఖర్ రెడ్డి, రమేష్, వెంకటేశ్వర్ రెడ్డి, ముఖ్యమిత్రుడు జి. నర్సింగరావు, సుధాకర్ రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొని నరసింహారెడ్డికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం హర్షాతిరేక వాతావరణంలో ముగిసింది.

# జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఐపీ కలకలం
### రూ.210 కోట్లు ఐపీ దాఖలవ్వడంతో ఉలికిపడ్డ గద్వాల్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఐపీ కలకలం రేగింది. వ్యాపారంలో దివాళా తీసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 210కోట్ల రూపాయాలు ఐపీ పెట్టిన్నట్లు ప్రచారం జరుగుతోంది. తీసుకున్న అప్పులు కట్టలేక గద్వాల కోర్టులో ఐపీ పిటీషన్ దాఖలు చేసినట్లు ఒక్క సారి సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టడంతో గద్వాల పట్టణ ప్రజలు ఉలిక్కిపడింది. ఒకటా , రెండా ఏకంగా 210 కోట్ల రూపాయాలు ఐపీ పెట్టడం ఏమిటి అని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు. అనోటా.. ఈనోటా పడిన ఈ వార్త సోషల్ మీడియాలో దహనంలా వ్యాపించింది. దీంతో నిర్ఘాంతపోయిన జిల్లా ప్రజలు ఐపీ పెట్టిన వ్యాపారి ఎవరు అనేది సోషల్ మీడియాలో ఆరాతీయడం ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారికి రూ.210 కోట్ల అప్పు ఇచ్చిన బిగ్ షాట్ లు ఎవరనేది సందిగ్ధంలో పడ్డారు. తీరా జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన వ్యాపారి కాకపోవచ్చు అని నిర్ధారించారు. ఐపీ పెట్టింది రాయలసీమకు చెందిన రియల్ వ్యాపారి అయిండొచ్చు అని అందరు భావిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కోట్లు రూపాయలు అప్పు తీసుకుని చేసిన అప్పులకు తిరిగి చెల్లించక ఈ ఘాతకానికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వివరాలోకి వెళ్లితే....**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నంద్యాలజిల్లాకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఉదంతం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. నంద్యాల జిల్లా డోన్ ప్రాంతానికి చెందిన శ్రీనివస్ రెడ్డి అనే వ్యక్తి బెంగళూరు కేంద్రంగా తన రియల్ ఎస్టేట్ వ్యాపార సామ్రాజ్యం కొనసాగించినట్లు తెలుస్తోంది. అనంతపురం, డోన్, బెంగుళూరు తో పాటు పెద్ద పెద్ద పట్టణాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగించిన నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారి కుప్పకూలడంతో ఏకంగా రూ. 210 కోట్లకు గద్వాల కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ వ్యవహారం వెనుక భారీ హవాలా స్కామ్ ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జోగుళాంబ గద్వాలకు చెందిన వ్యక్తి కాకపోవడంతో ఈ స్కామ్ వెనుక పెద్ద మతలబ్ దాగియుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గద్వాల లో ఒక ప్రాంతంలో తాను నివాసముంటున్నట్లు రెంటల్ అగ్రిమెంట్ సృష్టించి ఐపీ దాఖలు చేయడం విశేషం. గద్వాల కోర్టులో ఐపీ దాఖలు చేసింది కర్నూల్ కు చెందిన న్యాయవాదులు అని అందుకు గద్వాలకు చెందిన న్యాయవాదులేమైన సహకరించార అనే విషయంపై అధికారులు కూపీ లాగుతున్నారు. గద్వాల కోర్టులో దాఖలైన ఐపీ పీటీషన్ ద్వారా వ్యాపారికి అప్పులు ఇచ్చిన వారికి నోటీసులు అందడానికి సులువుగా ఉంటుందనే ఉద్దేశంతో గద్వాల కోర్టును ఎంచుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారిపై డోన్, అనంతపురంలో కోట్ల రూపాయలు ఫ్రాడ్ చేశారంటూ పలు పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదయ్యాయి.




**హవాలా ద్వారా అమెరికాకు సొమ్ము తరలింపు**

రియల్ ఎస్టేట్ రంగం బూమ్ లో ఉన్నప్పుడు అనంతపురం, బెంగుళూరు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, చెన్నై, వంటి రాష్ట్రాలలో ఆ వ్యాపారి లావాదేవీలు నడిపించాడు. బాధితుల నమ్మించి కోట్ల రూపాయాలు వసూలు చేశాడు. ఇలా వసూళ్లు చేసింది రూ.200-400కోట్లు ఉండొచ్చని అనుమానం. అ సొమ్ములో దాదాపు రూ. 150 కోట్ల వరకు హవాలా రూపంలో అమెరికాకు తరలించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన 'పెట్టుబడి ద్వారా గ్రీన్ కార్డ్' పొందే పథకాన్ని ఇతను ఆసరాగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పథకం కింద ఒక్కొక్కరికి సుమారు ఏడు కోట్ల రూపాయలు చొప్పున చెల్లించి, తన కుటుంబ సభ్యులందరికీ అమెరికా పౌరసత్వం సంపాదించి విదేశాలకు పారిపోయేందుకు పక్కా స్కెచ్ వేసినట్లు చర్చ జరుగుతోంది.

**మూడు రాష్ట్రాల్లో బాధితులు.. తీరని వడ్డీల భారం**

శ్రీనివాసరెడ్డి కేవలం ఒక్క రాష్ట్రానికే పరిమితం కాకుండా అనంతపురం, కర్నూలు, బెంగళూరు పట్టణాల్లో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు. ప్రస్తుతం ఇతనికి ఉన్న ఆస్తుల విలువ సుమారు రూ. 125 కోట్లు ఉండగా, అప్పులు మాత్రం ఏకంగా రూ. 270 కోట్ల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ రంగం ఆశించిన స్థాయిలో పుంజుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని, మార్కెట్ పడిపోవడం వల్లే అప్పులకు వడ్డీలు కొండలా పెరిగిపోయాయని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ వడ్డీల భారం భరించలేక, బాధితుల నుంచి తప్పించుకోవడానికే దేశం విడిచి వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

**గద్వాల కోర్టులో విచారణ**

శ్రీనివాసరెడ్డి తనపై ఉన్న ఒత్తిడిని తగ్గించుకోవడానికి, రుణదాతలకు తెలియకుండా ఉండేందుకు గద్వాల కోర్టులో పిటిషన్ (క్రా 01/2026) దాఖలు చేశారు. సుమారు 226 మంది బాధితుల్లో చాలామంది కోటి రూపాయల వరకు నష్టపోయినట్లు సమాచారం. బెంగళూరులోని తన లగ్జరీ కార్లు, నగలు అమ్మేసి సుమారు రూ. 20 కోట్ల నగదుతో ఉడాయించేందుకు ప్లాన్ చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ ఆర్థిక నేరంపై గద్వాల కోర్టులో విచారణ మార్చి 30, 2026న జరగనున్నది.


# జిల్లా కలెక్టర్‌గా రిజ్వాన్ భాషా షేక్
### గద్వాల్ ఆర్డీఓగా టి.శ్రీనివాస్ రావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం)**



పలువురు ఐఏఎస్ లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేస్తు బుధవారం సీఎస్ రామ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో జోగుళాంబ గద్వాల కలెక్టర్ గా పని చేస్తున్న బిఎం సంతోష్ హైదరబాద్ లోని గిరిజన సంక్షేమ శాఖ (ట్రైబల్ వెల్ఫేర్) డైరెక్టర్ గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జనగాం జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న రిజ్వాన్ భాషా షేక్ గద్వాల జిల్లా కలెక్టర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అదే విధంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెవెన్యూ శాఖ అధికారుల బదిలీలు జరిగాయి. వెయిటింగ్ లో ఉన్న మరో అదనపు కలెక్టర్ పద్మజారాణి గద్వాల డీఆర్వోగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జోగులాంబ గద్వాల జిల్లా హౌసింగ్ పీడీగా పనిచేస్తున్న టి శ్రీనివాసరావు గద్వాల జిల్లా ఆర్డీవో గా నియామకం కాగా.. ఆర్డీవో గా పని చేస్తున్న అలివేలు హౌసింగ్ పీడీగా నియమితులయ్యారు.

# వాళ్ళు మొక్కుబడిగా కూలుస్తారు
# వీళ్ళు మళ్లీ మళ్లీ కట్టేస్తారు..





## కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల్లో ...

## నిరంతర ప్రక్రియగా కబ్జాల పర్వం

## ప్రభుత్వ భూమిని కాపాడలేని అధికార గణం

## కబ్జాదారులకు అధికారుల ఆశీస్సులున్నట్లు అనుమానం

**పటాన్ చెరు, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం):**

ఓ వైపు ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ పత్రికా ముఖంగా హెచ్చరికలు జారీ చేస్తారు. మరోవైపు అధికారుల హెచ్చరికలు బేఖాతరు చేస్తూ కబ్జాదారులు ఎన్ని సార్లు కూల్చివేతలు జరిపినా తిరిగి మళ్లీ మళ్లీ నిర్మాణాలు చేపడుతూనే ఉంటారు. ఈ తతంగం అంతా జిన్నారం మండల పరిధిలో నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని పత్రికలు చదువుతున్న ప్రతి ఒక్కరికీ స్పష్టంగా అర్థం అవుతుంది. హైదరాబాద్ మహానగరానికి అతి సమీపంలో ఉన్న జిన్నారం మండల పరిధిలో రోజూ ఏదో ఒక మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఉల్లంఘనల పర్వం కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా మహా నగరానికి, దాంతో పాటు బాహ్యవల రహదారికి( ఓఆర్ఆర్) అతి సమీపంలో ఈ ప్రాంతం ఉండడంతో ఇక్కడ చేపడుతున్న నిర్మాణాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో మొత్తం కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. ముఖ్యంగా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి శివారు సర్వే నెంబర్ 181 లో ఈ కబ్జాదారులు బరితెగించి నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఎన్ని సార్లు నిర్మాణాలు కూల్చివేతలు జరిపినా తిరిగి యధాతథంగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు చేస్తూ నిర్మాణాలు పూర్తి చేస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఎన్నో సార్లు నిర్మాణాలు కూల్చివేతలు చేపట్టి, కబ్జాదారులపై పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసారు. ఆయా పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు అయిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ కబ్జాదారులు బరితెగింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన భూములు కావడంతో పాటు రెవెన్యూ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కబ్జాలు, ఆక్రమణలు యధాతథంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఖాజిపల్లి శివారు ప్రాంతాల్లో ఈ కబ్జాదారులు దురాక్రమణకు చేపట్టిన దాఖలాలు అనేకం ఉన్నాయి. సర్వే నెంబర్ 181 లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు కూల్చివేతలు జరిపి, ఆ స్థలంలో అగ్ని మాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) నిర్మాణానికి కేటాయించడం జరిగింది. అయినప్పటికీ అక్రమ నిర్మాణాలు చేపట్టడం రెండు మూడు సార్లు కూల్చివేతలు జరపడం అయ్యింది. తాజాగా మరలా అదే ప్రాంతంలో ఇండ్ల నిర్మాణం జరుగుతోంది. ప్రభుత్వ భూమి ఈ స్థాయిలో అన్యాక్రాంతం అవుతున్నా అధికారులకు స్థానికులు, ప్రజాప్రతినిధులు అనేక సార్లు పిర్యాదు చేసినా ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట పడడం లేదు. అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వ భూమి భవిష్యత్తు అవసరాలకు లెకుండా అన్యాక్రాంతం అవుతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ భూమిని రక్షించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, కబ్జాదారుల పై ఉక్కు పాదం మోపాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



## నానో ఫెర్టిలైజర్, ఆయిల్ పామ్ తోటల గురించి అవగాహన

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ , వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గువ్వలదిన్నె గ్రామంలో స్థానిక అవసరాల ఆధారంగా వ్యవసాయ సంబంధిత కొత్త, మెరుగైన సాంకేతికతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం, నానో ఫెర్టిలైజర్ , ఆయిల్ పామ్ తోటల గురించి వివరించారు. ఈ సమావేశంలో డీపీడీ జగ్గు నాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు సంగీత లక్ష్మీ, వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి, ఉద్యాన వన అధికారి మహేష్ , వ్యవసాయా విస్తరణ అధికారులు, సబ్జెక్ట్ నిపుణులు హరిప్రియ, శివ సతీష్ , గ్రామ సర్పంచ్, రైతులు, పాల్గొన్నారు.



## రెండో వార్డు, మూడో వార్డులో కుక్కలదాడిలో గేదెలు, మేకలు మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**

వీధి కుక్కల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గురువారం రాత్రి మూడో వార్డులో నివసిస్తున్న సురేష్, శ్రీనివాస్, నరేష్ అనే రైతులకు చెందిన గేదెలు, మేకలపై వీది కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో అయిదు గేదెలు, రెండు మేకలు మృతి చెందాయి. సుమారు రూ.60,000 వరకు ఆస్తినష్టం జరిగిందని,ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితులు విన్నపించారు. విషయం తెలుసుకున్న మూడవ వార్డు కౌన్సిలర్ నాగులుయాదవ్, బారాస నాయకులు రంజిత్‌కుమార్, అఖిల్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాండు సంఘటన స్థలానికి చేరుకుని రైతు సురేష్ ను పరామర్శించారు. వీది కుక్కలను తరలించాలని గద్వాల మున్సిపల్ అధికారులను కోరారు.



## వామనపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సభ ఏర్పాటు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని వామన్ పల్లి గ్రామ సర్పంచ్ పర్ణికా కృపాకర్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం వామన్ పల్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో వామనపల్లి, నర్సన్ దొడ్డి, జీరబండ గ్రామస్తులు పాల్గొన్నారు. వేసవి కాలంలో త్రాగు నీటి బోర్ మోటార్ మరమ్మతులు, యువత కు క్రీడా ప్రాంగణం, జీ రామ్ జి ( ఉపాధి హామీ కొత్త జాబ్ కార్డ్స్ ), విద్యుత్ సమస్యలు గురించి చర్చించారు.సమస్యలను సంబంధిత మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామన్నారు. అలాగేఅద్దె భవనంలో నిర్వహిస్తున్న వామన్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం నూతన భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో త్వరలో నే నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మించేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శిరీష రాజు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ వేణి, అంగన్ వాడి టీచర్ శోభ, విద్యుత్ , వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



ఆరాంఘర్ చౌరస్తాలో న్యాయవాదులు

## న్యాయవాదుల కోసం రక్షణ చట్టం తీసుకురావాలి

**బుద్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం)**

న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తు ఆలంపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన పాదయాత్ర శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఆరాంఘర్ చౌరస్తా కు చేరుకుంది. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని, న్యాయవాదుల పై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర గా వచ్చిన ఆలంపూర్, మహబూబ్ నగర్ న్యాయవాదులకు రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాసోజు యాదగిరి, జి బందయ్య ల ఆధ్వర్యంలో స్వాగతం పలికి మద్దతు ప్రకటించారు. పాదయాత్రలో ఆలంపూర్, మహబూబ్నగర్ కు చెందిన న్యాయవాదులు శ్రీనివాసరావు, అనంతరెడ్డి, టి క్రిష్ణ, శ్రీధర్ రావు, జ్యోతి, వినోద్ కుమార్ లతో పాటు రాజేంద్రనగర్ కు చెందిన కోరని వరప్రసాద్, మదుసూదన్ రెడ్డి, సిద్ధేశ్వర్ గౌడ్, సుదాకర్ రెడ్డి, రియాజ్ పాష, మాణిక్యం, ప్రతాప్ గౌడ్ లు ఉన్నారు.



## విజయవంతమైన జాబ్ మేళా

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**

విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కళాశాల ప్రధాన లక్ష్యమని, గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు ఉపాది అవకాశాలు కల్పిస్తూ వారి జీవితాల్లో తమ కళాశాల వెలుగులు నింపుతుందని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ వెల్లడించారు మేజిక్ బస్ ఇండియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గద్వాలలోని ప్రభుత్వ ప్రియదర్శిని మహిళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన బాబ్ మేళా విజయవంతమైంది. ఈ జాబ్ డ్రైవ్‌లో మొత్తం 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా, వీరిలో 40 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులందరికీ అదే రోజు అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కెరీర్‌లో ముందుకు సాగాలని సూచించారు. సిపిడిసి మెంబర్ సాయి శామ్ రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం సమాజాభివృద్ధికి ముఖ్యమని తెలిపారు. మేజిక్ బస్ ఇండియన్ ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు ఇస్మాయిల్, ఫయాజ్ కంపెనీలతో సమన్వయం చేసి ఇంటర్వ్యూల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. క్యారియర్ గైడెన్స్ & ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎం. సమత సమగ్ర సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, మేజిక్ బస్ ఇండియన్ ఫౌండేషన్ నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా వెలిసిన దుకాణాలు

### పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై ఎలాంటి ఆక్రమణలు లేకుండా, పాదచారులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకునే అంశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వైఫల్యం చెందారన్న విమర్శలున్నాయి. కొత్త బస్టాండ్, పాతబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, ఎంఅర్‌ఓ ఆఫీస్, భీంనగర్, బీరొల్లి చౌరస్తా, తదితర ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఖాళీ జాగను ఆక్రమించి డబ్బాలతో దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నించిన వారికి దర్జాగా పెడ్తాం... ఏం చేసుకుంటారో చేస్కోండని అంటున్నారని కొందరు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అండదం డలతోనే ఫుట్‌పాత్‌లపై దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుకిరువైపులా కొన్నేళ్లుగా డబ్బాలతో స్థలాన్ని ఆక్రమించి, చివరికి పర్మినెంట్ స్ట్రక్చర్‌తో దుకాణా లను ఏర్పాటు చేసుకున్న సందర్భాలున్నాయి. ఈ నిర్మాణాలన్నీ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేవిధంగా ఉన్నా, నేటి వరకు ఆ దుకాణాలను తొలగించే ప్ర యత్నాలను అధికారులు చేపట్టకపోవడంతో ఆడిందే ఆటగా మారింది. ఇప్పటికైనా ఫుట్‌పాత్‌లపై వెలిసిన షాపులను తొలగించాలని, పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌ను కేవలం పాదచారులే వినియోగించేవిధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



## వీధి కుక్కలు నివారణకు చర్యలు తీసుకోవాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)**

గద్వాల్ మున్సిపాలిటి పరిధిలోని పలు వార్డులలో వీధి కుక్కల దాడులు అధికం అయ్యాయని, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం 2,3 వార్డులకు చెందిన ప్రజలు, కాలనీవాసులు గద్వాల్ మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మీ నర్సింహులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల మున్సిపాలిటి రెండవ వార్డు, మూడవ వార్డుకు చెందిన సురేష్, శ్రీను, నరేష్ లకు చెందిన గేదెలు, మేకలపై వీధి కుక్కలు దాడి చేసి చంపేయడం జరిగిందన్నారు. ఒక్కో రైతుకు రూ.60,000 అస్తినష్టం వాటిలిందన్నారు. వీధి కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, కాలనీలో చిన్నారులు ఆడుకోలేక పోతున్నారని, మహిళలు బయటికి వెళ్లాలంటే భయపడుతున్నారని వివరించారు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, శ్రీను, నరేష్, సూరి, రంజిత్ కుమార్, పాండు, అఖిల్ రెడ్డి, పరమేష్, ధర్మవరం శ్రీనివాస్,రాజు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608